క్లుప్తంగా

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 16వతేదీ సోమవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ చెప్పారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల వారీగా ప్రజాసమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

రోగికి ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్: ఇబ్బందులు పడుతున్న వారికి సాయం చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందని వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. పాలకొల్లు మండలం గవరపేటకు చెందిన దాడి అప్పారావు అనారోగ్యానికి గురై కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. అప్పారావు పాలకొల్లు కొత్తకుళాయి చెరువుగట్టున ఉదయం పూట రాగిజావ విక్రయించుకుని జీవనం సాగిస్తున్నారు. అతని ఆర్థిక ఇబ్బందులను వాకర్స్‌క్లబ్ గుర్తించి రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు, ధనాని శ్రీరామమూర్తి, నంబూరు గంగా పవన్, జవ్వాజి కల్యాణ్, మేకా త్రిశూలపాణి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించుకోవాలి


బైబిల్ పరీక్ష విజేతలతో నిర్వాహకులు

ఉండి: ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించుకోవాలని ఉండి పెదపేట సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చ్ పేరిష్ పాస్టర్ రెవరెండ్ మానుకొండ ప్రసన్నకుమార్ అన్నారు. చర్చ్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో బైబిల్ పరీక్షకు 250 మంది హాజరైయ్యారని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ధరనిజ, జి.కరుణ, లీలీరోజ్‌కు రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు చొప్పున, మరో ఏడుగురికి రూ.వెయ్యి చొప్పున అందజేమన్నారు. కార్యక్రమంలో ప్రకాశరావు, చిరంజీవిరావు, వాసుపల్లి రవికుమార్, స్త్రీల సమాజం, యూత్, సండే స్కూల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కలిగొట్లలో బ్రిడ్జి ప్రారంభం


కలిగొట్లలో ప్రారంభం కానున్న బ్రిడ్జి

ఉండి: ఉండి మండలం కలిగొట్లలో రైతులు, దాతల సహకారంతో వెంకయ్య వయ్యేరుపై నిర్మించిన సద్గుణాంబ బ్రిడ్జిని ఆదివారం ఉదయం ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బ్రిడ్జిని వేగేశ్న అనంతకోటిరాజు (రాజు వేగేశ్న ఫౌండేషన్) ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, మంతెన రామరాజు, ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే వీవీ శివరామరాజు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ హాజరవుతారని పేర్కొన్నారు.

సామాజిక సేవలు అభినందనీయం

సాక్షి, భీమవరం: కుల సంఘాలు సొంత కార్యక్రమాలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.లక్ష్మీకాంతం అన్నారు. భీమవరం కాపు అఫీషియల్, ప్రొఫెషనల్స్ (కోపా)ఆధ్వర్యంలో శనివారం భీమవరం బ్యాంకు కాలనీలోని సుంకర బ్రహ్మయ్య-సుబ్బమ్మ కల్యాణ మండపంలో ఆంధ్ర, తెలంగాణ కాపు విద్యార్థులకు ఎన్నారై సహకారంతో మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉభయతెలుగు రాష్ట్రాల్లో మొత్తం 70 విద్యార్థులకు ఎన్నారై సంస్థ మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (మాత) తరుపున ఒక్కొక్కరికి 150 డాలర్లు, ఆల్ ఇండియా తెలగా బలిజ కాపు సంఘం సహకారంతో ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఆంధ్ర, తెలంగాణ తెలగా, బలిజ, కాపు సంఘం అధ్యక్షుడు యర్రపోతు ప్రభాకరరావు మాట్లాడుతూ మాతా సంస్థ సహకారంతో రాష్ట్ర కాపు సంఘం సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంఘం తరపున విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో పాటు భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. భీమవరం సంఘం అధ్యక్షుడు యర్రంశెట్టి హరినాథ్ మాట్లాడుతూ భీమవరంలో 1995 నుంచి విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్స్ అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చలమలశెట్టి సునీల్, అల్లు పీర్లస్వామి, ఆరేటి వెంకట సత్యనారాయణ, తోట సుబ్బారావు, గుండా జయప్రకాష్‌నాయుడు, నందమూరి వెంకట సుబ్బారావు, దాయన సురేష్ చంద్రాజీ, కట్టిరెడ్డి సోమేశ్వరరావు, నల్లం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

దసరా వచ్చిందయ్యా

- గ్రామాల్లో దసరా సందడి ప్రారంభం
- దుర్గమ్మ పూజలకు సర్వం సిద్ధం


పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయం


పెనుగొండలో సిద్ధం చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి ప్రతిమ

పెనుగొండ/పాలకొల్లు సెంట్రల్: గ్రామాల్లో దసరా ఉత్సవాల సందడి నెలకొంది. ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. స్థానిక పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో ఆదివారం నుంచి శ్రీదేవీ శరన్నరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ల రామకృష్ణ మోహనరావు తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ అక్టోబరు 23 వరకూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఆలయం మహిషాసురమర్దనీ, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లను 15న శ్రీబాలా త్రిపుర సుందరీ దేవి, 16న శ్రీరాజరాజేశ్వరి, 17న లలితాదేవి, 18న అన్నపూర్ణాదేవి, 19న గాయత్రీ దేవి, 20న సరస్వతీ దేవి, 21న లక్ష్మీదేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసురమర్ధనీ అలంకరణలో దర్శనం ఇస్తారన్నారు. ఈ సందర్భంగా నగరేశ్వర స్వామికి నిత్యం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకంలు, వేదపారాయణ, సూర్యనమస్కారాలు, మహాలింగార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతిధాంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవింద రాజులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని దేవతామూర్తుల అలంకరణలో చేయనున్నట్లు తెలిపారు.

పాలకొల్లులో ఇలా

పాలకొల్లులో కూడా శరన్నవరాత్రుల మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని విగ్రహాల తయారీ దారులు అమ్మవార్ల విగ్రహాలను సిద్ధం చేశారు. నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. శనివారం రాత్రికి కమిటీ సభ్యులు విద్యుత్ దీపాలంకరణలు, పందిళ్ల క్లాత్ డెకరేషన్ ఏర్పాట్లను పూర్తి చేసే విధంగా పనులు వేగవంతం చేశారు. పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో, యడ్లబజారు శ్రీ కనకదుర్గమ్మ ఆలయం, చినగోపురం వద్ద శ్రీ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపాల్లో రోజుకో అలంకరణలో అమ్మవార్లను అలంకరించనున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు మేళతాళాలతో అమ్మవార్ల మట్టి విగ్రహాలను వాహనాలపై ఊరేగింపుగా తీసుకువెళ్లారు.


సిద్ధాంతంలో తుది మెరుగులు దిద్దుకుంటున్న అమ్మవారి ప్రతిమలు



సిద్ధాంతం బస్టాండ్ కూడలిలో విద్యుత్ దీపాలంకరణ


పాలకొల్లులో ముస్తాబైన మండపం

రేపటి నుంచి గ్రామసభలు

నరసాపురం రూరల్: హాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-2025 సంవత్సరంలో చేపట్టబోయే పనులను ఆమోదించేందుకు ఈ నెల 16 నుంచి గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్వీ శివప్రసాద్‌యాదవ్ శనివారం విలేకరులకు తెలిపారు. గ్రామ సభల్లో గుర్తించిన పనులు గ్రామసభ, పంచాయతీ ఆమోదం పొందిన తీర్మానాలు సిద్ధం చేస్తారన్నారు. పనుల ప్రణాళికలను గుర్తించి ప్రతి గ్రామ సభల ద్వారా పనులు గుర్తించడం, లేబర్ బడ్జెట్ రూపకల్పన చేయడంతోపాటు ఉపాధి కూలీ కుటుంబానికి వంద రోజులు పని కల్పించేలా పనులు కేటాయించడం వంటి పనులు చేపడతున్నామన్నారు. అక్టోబరు 2 నుంచిప్రారంభమైన ఈ ఉపాధి ప్రణాళిక రూపకల్పన ప్రక్రియలో సోమవారం నుంచి గ్రామాల వారీగా జరిగే సభల్లో రైతులు, ఉపాధి కూలీలు, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

కాంతులీనుతున్న కాటన్ పార్కు


లైటింగ్‌తో కొత్త కాంతులతో కాటన్‌పార్కు


రాత్రిపూట సందడిగా ఉన్న కాటన్‌పార్కు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న కాటన్‌పార్కు పర్యాటకులతో కళకళలాడుతోంది. గత పాలకుల నిర్లక్ష్యంతో పూర్తిగా మూతపడ్డ పార్కును రూ 1.14 కోట్లతో ఇటీవల అభివృద్ధి చేశారు. ముఖ్యంగా పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ ఆకట్టుకుంటోంది. దీంతో రాత్రిపూట కూడా పర్యాటకుల సంఖ్య పెరిగింది. పట్టణంలో రెండు ప్రధాన పార్కులు ఉన్నాయి. ఇందులో ఒకటి కాటన్ పార్కు కాగా, మరొకటి శారదా థియేటర్ వద్ద బాలయ్య పార్కు. కాటన్ పార్కు శిథిలమై దాదాపు మూతపడే స్థితికి వచ్చింది. దీంతో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టి పెట్టి పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ప్రణాళికా అభివృద్ధి సంఘం నిధులు కేటాయింపజేశారు. మున్సిపాలిటీ కూడా కొంతమేర జనరల్‌ఫండ్స్ కేటాయించి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రూ.19.50 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తో లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ లైటింగ్ పార్కుకు అదనపు ఆకర్షణగా నిలిచింది.

వైస్ ఎంపీపీ గొల్లపల్లికి గుడాల పరామర్శ


వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాస్‌కు ఆర్థిక సహాయం చేస్తున్న గుడాల గోపి

యలమంచిలి: వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాస్ ఇటీవల కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన స్వగ్రామం కనకాయలంక వచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి కనకాయలంక వెళ్లి శ్రీనివాస్‌ను కలుసుకున్నారు. అతని ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. త్వరలోనే పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు గోపి ఆర్థిక సహాయం అందించారు. శ్రీనివాస్‌కు కిడ్నీ దానం చేసిన ఆయన తల్లి వరలక్ష్మిని శాలువాతో సన్మానించారు. శ్రీనివాస్‌ను పరామర్శించిన వారిలో సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు నాయకులు ఉచ్చుల స్టాలిన్, పులి కాశీ విశ్వేశ్వర కేశవమూర్తి, పులి సుబ్రహ్మణ్యం, విప్పర్తి నవీన్, జవదాల సువర్ణరాజు, కల్యాణం గంగాధరరావు, కుక్కల బాలచంద్రన్, నెల్లి ఆనందరావు, మోకా ప్రేమ్‌చంద్, మందా హరికుమార్, లంక చిరంజీవి, వీరా ఉమా శంకర్ ఉన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు


పండితవిల్లూరు జెడ్పీహైస్కూల్లో విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న దాతలు

పోడూరు: పండితవిల్లూరు జెడ్పీహైస్కూల్లో 2022-23 విద్యా సంవత్సరంలో జరిగిన వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శనివారం పూర్వ విద్యార్థులైన పలువురు దాతలు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. హైస్కూల్లో అన్ని తరగతులకు సంబంధించి వార్షిక పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు చింతా చిట్టిబాబు, నగదు బహుమతులు అందజేశారు. అలాగే 10వ తరగతి పరీక్షల్లో ఇంగ్లిషు, సైన్స్ సబ్జెక్టుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఇందుకూరి మోహన్‌రాజు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. 10వ తరగతి హిందీ పరీక్షలో ప్రథమ, ద్వితీయ సాధించిన విద్యార్థులకు లంకలకోడేరు జెడ్పీ హైస్కూలు హిందీ ఉపాధ్యాయురాలు కేఎస్‌పీ భాగ్యశ్రీ నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను దాతలు అభినందించారు. విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించేలా కృషి చేసిన పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఇందుకూరి శ్రీనివాసరాజుకు, దాతలకు హైస్కూలు హెచ్‌ఎం వీరవల్లి సత్య ప్రియరాం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

వేగంగా హిందూ శ్మశానవాటిక అభివృద్ధి


వేగంగా సాగుతున్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు

- రూ.1.98 కోట్లుతో గోదావరి గట్టున నిర్మాణం
- అధునాతన సౌకర్యాల ఏర్పాటు

నరసాపురం: నరసాపురంలో గోదావరి గట్టున కొండాలమ్మగుడి సమీపంలో ఉన్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.98 కోట్లతో అధునాతన సౌకర్యాలతో శ్మశానవాటికను అభివృద్ధి చేస్తున్నారు. పట్టణంలో ప్రధానమైన ఈ శ్మశానవాటిక అధ్వానంగా తయారైంది. గత మున్సిపల్ పాలకవర్గాలు ఈ సమస్యను పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. చుట్టూ చెత్త, దుర్గంధంతో దహన సంస్కారాలు చేయడానికి వచ్చేవారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కూర్చోవడానికి షెడ్డు గానీ, దహన సంస్కారాలు, స్నానాలు చేయడానికి సౌకర్యాలు లేవు. ఇక వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. శ్మశానవాటికకు వెళ్లే రోడ్డుమార్గం కూడా పాడైంది.

రూ.1.98 కోట్లతో అభివృద్ధి

ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు చొరవతో శ్మశానవాటికను అభివృద్ధి చేయడానికి నిర్ణయించి పనులు మొదలు పెట్టారు. దహన సంస్కారాలు కోసం గ్యాస్‌తో మండే చితిని, పక్కన పుల్లలతో కాల్చే చితిని వేర్వేరుగా ఏర్పాటు చేస్తున్నారు. రెండు షెడ్డులు, చుట్టూ ప్రహరీ, గోదావరి వద్ద ప్రత్యేకంగా స్నానాల రేవు, శ్మశానవాటికకు వచ్చే రోడ్డును నిర్మిస్తున్నారు. పక్కనే ఉన్న స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసి దానిలో దహన సంస్కారాలకు వచ్చేవారు కూర్చోవడానికి, అలాగే తాగునీటి సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో పూలమొక్కలు, చెట్లు వేసి సుందరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

అన్ని వసతులతో అభివృద్ధి



హిందూ శ్మశానవాటికను రూ.1.98 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. దాదాపు 40 శాతం పనులు పూర్తయ్యాయి. దహనసంస్కారం కోసం గ్యాస్ ఆధారిత యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. పక్కన అన్ని వసతులతో పార్కును అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. చుట్టూ ప్రహరీ కూడా నిర్మిస్తున్నాం. బరియల్ చేయడానికి వచ్చేవారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడతాం.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

శ్రీకనకదుర్గమ్మకు వెండిచీర సమర్పణ


పెనుమంట్రలో వెండిచీరను సమర్పిస్తున్న కర్రి సుబ్బారెడ్డి,శాంతి దంపతులు

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామంలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో సత్య టెక్నాలజీ అధినేత కర్రి సుబ్బారెడ్డి శాంతి దంపతుల దాతృత్వంతో రూ. 6 లక్షల వ్యయంతో తయారు చేసిన వెండి చీరను శనివారం అమ్మవారికి అలంకరించారు. ఉదయం ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వెండిచీరను అమ్మవారికి అలంకరణ చేశారు. ముందుగా చండీహోమం, శాంతి పూజ, కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితులు వెండిచీరను మూలవిరాట్‌కు అలంకరించారు. రాజమండ్రి రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆమె వెంట ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తమనంపూడి సాయి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుదీర్‌రెడ్డి, నల్లమిల్లి గవిరెడ్డి, కొవ్వూరి నాగమోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్నకు సప్తనదుల జలాభిషేకం


వెంకటేశ్వరస్వామి వద్ద కలశాలతో ప్రధాన అర్చకులు, పీవీఎల్ నరసింహరాజు

కాళ్ల: కాళ్ల మండలం కాళ్లకూరు స్వయంభు వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి సప్త నదుల జలాభిషేక మహోత్సవాల్లో భాగంగా నాలుగు రోజు శనివారం స్వామివారి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గోదావరి, సరస్వతి, యమునా, గంగా, కృష్ణ, కావేరి, నర్మద నదుల నుంచి తీసుకొచ్చిన జలాలతో అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక హోమం నిర్వహించారు. తొలుత సప్త నది జలాలు, పవిత్రాలతో గ్రామంలో శోభయాత్ర నిర్వహించి అష్టోత్తర కలశార్చన గావించారు. శాంతి కళ్యాణం, అష్టోత్తర పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచీ భక్తులు బారులు తీరారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, ఎమ్మెల్యే రామరాజులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, గ్రామ ఉప సర్పంచ్ నడింపల్లి ప్రదీప్ రాజు, సాదు శ్రీనివాస్, సాగిరాజు హరి వర్మ, ఆలయ ధర్మ కర్తలు, గ్రామపెద్దలు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి మోకా అరుణ్ కుమార్, ధర్మకర్తలు, భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి దసరా ప్రత్యేక శిక్షణ శిబిరం

నరసాపురం: దసరా సెలవులను పురస్కరించుకుని నరసాపురం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం నుంచి ఈ నెల 25 వరకూ ప్రత్యేక దసరా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ కేజీఎస్ఎల్ కుమారి చెప్పారు. స్కూల్ విద్యార్థులకు ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకూ ఈ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. పుస్తక పఠనంపై పిల్లలకు ఆసక్తి పెంచడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, ఆటలు వంటి అంశాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం

పాలకొల్లు అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమని కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా.చంద్రశేఖర్ అన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. శిద్ధాని బాల శంకర మల్లేశ్వరరావు పౌష్టికాహారానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ ముత్యాల రామారావు, అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ధనాని సూర్యప్రకాష్, సభ్యులు బొక్కా రమాకాంత్, అందెల చిరంజీవి, ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, పాజిటివ్ సొసైటీ పీపుల్ సిబ్బంది శేషారాజ్యం తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయంలో చండీహోమం


శ్రీమావుళ్లమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో అమావాస్య సందర్భంగా శనివారం చండీహోమం నిర్వహించారు. 80 మంది దంపతులు పాల్గొని హోమాన్ని నిర్వహించారని ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. శ్రీమావుళ్లమ్మ వారికి భక్తులు ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు

సాక్షి, భీమవరం: వంటసామాగ్రి విషయంలో ప్రశ్నించినందుకు కులం పేరుతో దూషించారంటూ ఎరిచర్ల సుందరరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం టుటౌన్ సీఐ జి శ్రీనివాస్ శనివారం చెప్పారు. భీమవరం రూరల్ మండలం రాయలం గ్రామంలో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధన నిర్వహించగా షామియానలోని గిన్నె కన్పించలేదు. దీనితో గిన్నె ఏమైదంటూ సుందరరాజు అడగడంతో వీరమళ్ల శ్రీను మరో ఐదుగురు కలిసి కులం పేరుతో దూషించడమేగాక దాడి చేశారంటూ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

తమ్ముడిపై అన్న దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అన్నదమ్ములు ఆస్తి విషయంలో గొడవ పడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన కొయ్యల గడ్డ ఏడుకొండలు, తన అన్నయ్య సత్యనారాయణకు గతంలో ఆస్థి విషయమై తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కొయ్యల గడ్డు ఏడుకొండలు తలపై తన అన్నయ్య సత్యనారాయణ వదిన సూర్యకాంతం కొట్టి గాయపచడంతో భీమవరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఏడుకొండలు ఫిర్యాదు మేరకు ఏఎస్సై డి.సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.